

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 53 | మంగళవారం 2, జూన్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

# కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

- తుని నియోజకవర్గంలో పేదల సేవలో సభ
- వైసీపీని ఏకిపారేసిన సీఎం చంద్రబాబు
- సుపరిపాలన చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శలు
- నంద్యాలలో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తేనని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65,887 కోట్లకు పైగా పెన్షన్లు పంపిణీ చేశామని వెల్లడి

## తుని సభలో చంద్రబాబు ఫైర్



తుని జూన్ 1 : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే, ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకాలు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయిన కడుపు మంటతోనే రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరంలో సోమవారం జరిగిన 'పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలను ఏకిపారేశారు.

**సుపరిపాలన చూసి ఓర్వలేకే కుతంత్రాలు**

గత ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే, వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగించే ప్రయత్నంలోనే ఉందని చంద్రబాబు విమర్శించారు. "సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని గొడ్డలితో నరికి చంపి గుండెపోటు డ్రామా ఆడారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి కోడికత్తి, గులకరాయి నాటకాలతో ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా వారి బుద్ధి మారలేదు" అని మండిపడ్డారు. ఇటీవల జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ కుట్రలను ఆయన ఎండగట్టారు. "పరామర్శకు వెళుతూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లో పడేశారు. ఇటీవల కడపకు చెందిన ఓ పాస్టర్‌ను వంపి మాపై హత్యాయత్నం డ్రామా ఆడారు. అంతకుముందు పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి ప్రమాదంలో చనిపోతే, దాన్ని కూడా మాకు అంటగట్టాలని చూశారు. సీసీకెమెరాలతో ఈ కుట్రలు బట్టబయలత్తూయ్యాయి. సాక్షాత్తు తిరుమల కొండపై సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లు పడేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నించారు. కడపలో పెద్ద దస్తగిరిని ఆస్తుల వివాదంలో వైసీపీ వారే హత్య చేసి, టీడీపీపై నెపం మోపజూశారు. చివరికి నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది కూడా వైసీపీ కార్యకర్తే. అందుకే ఆ వార్తను సాక్షి పత్రికలో రాయలేదు. కాకినాడలో దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీకి వైసీపీ సన్మానాలు చేసింది. ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్న వారి ఆటలు సాగనీయం" అని చంద్రబాబు హెచ్చరించారు.

**విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి**

జూన్ 4వ తేదీ రాష్ట్ర చరిత్రలో విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. "గత పాలనలో ప్రజలు బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ భయం పోయింది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. రూ.10 లక్షల కోట్ల అప్పులున్నా, పెన్షన్లను రూ.1,000 పెంచి రూ.4,000 చేశాం. దివ్యాంగులకు రూ.6,000, ఆరోగ్య పెన్షన్లను రూ.10,000, రూ.15,000కు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా కింద అందించాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదు," అని చంద్రబాబు వివరించారు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం తప్ప, ప్రజల కష్టాలు తెలియవని, అందుకే ప్రతీ నెలా ఒకటో తేదీన నేరుగా ప్రజల వద్దకే వచ్చి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు.

**సంక్షేమంతో పాటు ఉపాధి, అభివృద్ధి**

సంక్షేమంతో పాటు అభివృద్ధి, సుపరిపాలన అందిస్తూనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం. కాకినాడ సమీపంలో రూ.80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయి. పీఎం సేతు కింద ఏటా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తాం. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరించాం. ఎన్నో ఏళ్ల కల అయిన విశాఖ రైల్వే జోన్ కూడా సాకారమైంది" అని ముఖ్యమంత్రి ప్రకటించారు. పోలవరం ఎడమ కాలువను జూలైలోగా పూర్తి చేసి విశాఖకు నీరందిస్తామని హామీ ఇచ్చారు.

**ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్**

పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "పాఠశాలల్లో సంస్కరణలు తెచ్చి నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖరీదైన వైద్యం కోసం అప్పులపాలు కాకుండా 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' తెస్తున్నాం. 'సంజీవని' పేరుతో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం," అని తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెడతామని, శ్రీకాకుళం, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘాటించారు.

**దివ్యాంగుడిని ఆప్యాయంగా పలకరించిన చంద్రబాబు**

సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకే 'పీ4' (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులుగా నిలుస్తున్న 'బంగారు కుటుంబాల'తో ఆయన మాట్లాడారు. అనంతరం, వేదిక వద్దకు వచ్చిన ఓ దివ్యాంగ అభిమానిని ఆప్యాయంగా పలకరించి, అతని భుజంపై చేయి వేసి ఫొటో దిగారు. అతనికి ప్రభుత్వ సహకారం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి. నారాయణ, ఎమ్మెల్యే యనమల దివ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ

- ముంబైలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో నారా లోకేష్ భేటీ
- ఏపీలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చలు
- ఎయిర్‌ట్రంక్ సీఈఓతో సమావేశమై వైజాగ్‌కు ఆహ్వానం
- విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన ఎయిర్‌ట్రంక్
- ఏపీకి ఐటీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యటన





మంగళగిరి జూన్ 1 : ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముంబైలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు. ముంబైలోని వర్షా బంగ్లాలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. లోకేష్ ఆయనకు తిరుమల శ్రీవారి ప్రతిమ, మంగళగిరి శాలువా బహూకరించగా, ఫడ్నవీస్ గణేశుడి విగ్రహాన్ని అందజేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక అంశాలు, ఏపీలో పెట్టుబడులు, వ్యాపార అనుకూల విధానాలు, విద్యా సంస్కరణలపై వారు చర్చించుకున్నారు. లోకేష్ తన ముంబై పర్యటనలో, ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో లోకేష్ సమావేశమై విశాఖపట్నం ప్రాధాన్యతను వివరించారు. వైజాగ్‌ను ఐటీ, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. విశాఖలో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని ఎయిర్‌ట్రంక్‌ను లోకేష్ ప్రత్యేకంగా కోరారు. లోకేష్ ప్రజెంటేషన్, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎయిర్‌ట్రంక్ సీఈఓ సానుకూలంగా స్పందించారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు అవకాశాలను తీవ్రంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఐటీ రంగంలోకి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా లోకేష్ ఈ పర్యటనలు చేపడుతున్నారు.

## పన్నుల ఎగవేతదారులపై పవన్ కల్యాణ్ ఉక్కుపాదం..

### డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలే టార్గెట్!

- గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతంపై పవన్ దృష్టి
- పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు ఎందుకు పన్నులు చెల్లించడం లేదని ప్రశ్న
- పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం



పిఠాపురం జూన్ 1 : గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతం, క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తున్న భారీ పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ రంగాల నుంచి పేరుకుపోయిన పన్ను బకాయిలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య పౌరులు తమ పన్నులను క్రమబద్ధంగా చెల్లిస్తున్నప్పుడు.. పెద్ద పెద్ద పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు తమ బాధ్యతలను ఎందుకు విస్మరిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. "సాధారణ ప్రజలు ఎంతో నిజాయతీగా పన్నులు కడుతున్నారు. మరి పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలు పంచాయతీలకు చెల్లింపులు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నాయి? ఎందుకు ఎగవేస్తున్నాయి?" అని పవన్ నిలదీశారు. పన్నుల రికవరీ ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఉపముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. సదరు సంస్థల నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని పన్నులను పూర్తిగా రికవరీ చేయడానికి కఠినమైన విధానాన్ని అవలంబించాలని అధికారులను ఆదేశించారు. వసూళ్ల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించని డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలపై తక్షణమే అవసరమైన చట్టపరమైన చర్యలను ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

## అనకాపల్లి వర్ష బాధితులకు అనిత భరోసా



తుని జూన్ 1 : ఇటీవల కురిసిన అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన అనాకపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. కేవలం ఒక అధికారిక పర్యటనలా కాకుండా, బాధితులకు భరోసా ఇచ్చేలా సాగిన ఆమె పర్యటన స్థానికుల్లో కొండంత ధైర్యాన్ని నింపింది. మంత్రి అనిత మొదటగా సత్యవరం గ్రామాన్ని సందర్శించారు. అక్కడ గ్రామస్థులు ఆమెకు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి అర్హులైన లబ్ధిదారులకు 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లను పంపిణీ చేశారు. స్థానిక ప్రజలతో ముచ్చటిస్తూ వారి దైనందిన సమస్యలను, సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత శ్రీరాంపురం గ్రామానికి చేరుకుని, బొద్దపాటి వీరస్వామి కుటుంబాన్ని పరామర్శించి వారి యోగక్షేమాలను ఆరా తీశారు. ఇటీవలి భారీ వర్షాల కారణంగా అరట్లకోట గ్రామానికి చెందిన ఎరకయ్య, శంకర్ అనే ఇద్దరు వ్యక్తులు మరణించారు. వారి కుటుంబ సభ్యులను మంత్రి అనిత వ్యక్తిగతంగా కలిసి, ఓదార్చారు. ఈ కష్టకాలంలో ప్రభుత్వం వారికి పూర్తిగా అండగా ఉంటుందని, తగిన సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు.


## ఏపీలో ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 65కి పెంపు?..




అమరావతి జూన్ 1 :ఏపీలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు మరోసారి పెరగనుందా? ఈ అంశంపై కొంతకాలంగా జరుగుతున్న చర్చకు విద్యాశాఖ ఉన్నతాధికారి చేసిన వ్యాఖ్యలు మరింత బలాన్నిచ్చాయి. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచే అవకాశం ఉందని విద్యాశాఖ మౌలిక సదుపాయాల జాయింట్ డైరెక్టర్ (జేడీ) మువ్వా రామలింగం పేర్కొన్నారు.

# రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న దృశ్యం

## -సీనియర్ జర్నలిస్ట్ ఎం నగేష్ నాయుడు



సిద్ధవటం ( ప్రజా సీమ) కడప జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా గ్రామీణ విలేకరులకు రెండు రోజుల పాటు పునశ్చరణ శిక్షణా తరగతులు నిర్వహించారు ఈ సందర్భంగా రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ చేతుల మీదుగా సర్టిఫికేట్ అందుకున్న అక్షర సందేశం మాస పత్రిక ఎడిటర్ ఎం నాగేష్ నాయుడు ఆదివారం సాయంత్రం ప్రశంసా పత్రం అందుకోవడం జరిగిందని తెలిపారు.

# కర్నూల్ రేంజ్‌లో 12 మంది ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతులు

కడప జూన్ 1 (ప్రజాసీమ): కర్నూల్ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న 12 మంది ఎస్ఐలకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా (సీఐలు) పదోన్నతులు లభించాయి. పదోన్నతులు పొందిన అధికారులు అనంతపురంలోని డీఐజీ కార్యాలయంలో హాజరై రిపోర్ట్ చేసుకున్నారు. అనంతరం వారిని ఆయా జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐలుగా పదోన్నతి పొందిన వారిలో నరేష్, వెంకటేష్, షేక్షావలి, ధనుంజయ, శ్రీనివాసులు, జీవన్ రెడ్డి, అరుణ్ రెడ్డి తదితరులు ఉన్నారు. పదోన్నతులు పొందిన అధికారులకు సహచరులు, ఉన్నతాధికారులు అభినందనలు తెలియజేశారు. రేంజ్ పరిధిలో పోలీసు శాఖలో



సేవలందిస్తున్న అధికారులకు ఈ పదోన్నతులు ప్రోత్సాహకరంగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

# బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాట్ల పై పరిశీలనకు వచ్చిన సీఎస్ఐఆర్ ప్రతినిధుల బృందం



పుల్లంపేట ప్రజాసీమ న్యూస్: తిరుపతి జిల్లా పుల్లంపేట మండల పరిధిలోని బాయ్స్ హాస్టల్ మరియు ఏపీ మోడల్ స్కూల్ హాస్టళ్లను సీఎస్ఐఆర్ .కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్. ప్రతినిధులు డా. సి. చంద్రశేఖర్, పి. రాజేశ్, అలాగే స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ హెచ్ఆర్‌డీ కన్సల్టెంట్లు మహేష్, రాజా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో ఉత్పత్తి అయ్యే సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. వ్యర్థాల నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపు లక్ష్యాలతో ఈ ప్రతిపాదనలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో వై. శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో సి. శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ దినేష్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లీల శ్రీహరి, పుతనవారిపల్లి కొత్తపేట పంచాయతీ కార్యదర్శులు జనార్ధన్ అరుణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, గర్ల్స్ హాస్టల్ వార్డెన్ సుమతి, బాయ్స్ హాస్టల్ వార్డెన్ కె. తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి పాఠశాల ఆయాల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

## -ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి హాజరు



రైల్వే కోడూరు ( ప్రజా సీమ ): తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలం 01-06-2026 సోమవారం నాడు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలలకు చెందిన ఆయా కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సమావేశానికి ఏఐటీయూసీ రైల్వే కోడూరు నియోజకవర్గ నాయకులు కా. పైనం విష్ణు శివజ్యోతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ తిరుపతి జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ చంద్రశేఖర్ రెడ్డి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కా. జి గంగాధరం హాజరై నూతన కమిటీ ఎన్నికను పర్యవేక్షించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మురళి చైతన్య సరోజమ్మ స్కూల్ ఆయా కార్మికులు, పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన రైల్వే కోడూరు మండల కమిటీ - 11 మంది ఆఫీస్ బేరర్స్- అధ్యక్షులు కమలమ్మ, ప్రధాన కార్యదర్శి గంగాదేవి, కోశాధికారి సుబ్బరత్నమ్మ ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు 8 మంది ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, గంగాధరం లు మాట్లాడుతూ పాఠశాలల ఆయా కార్మికుల ప్రధాన డిమాండ్లను వివరిస్తూ దేశవ్యాప్తంగా కనీస వేతనం రూ. 26,000/- ఇవ్వాలని పోరాడుతుంటే, పాఠశాల ఆయాల కార్మికులకు కేవలం రూ. 6,000/- చెల్లిస్తున్నారని కనీసం నెలకు రూ. 15,000/- జీతం ఇవ్వాలని , ఈ ఎస్ ఐ, పి ఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు ,రెండు జతల యూనిఫాంగా ఇవ్వాలని ,అన్ని పాఠశాలలకు క్లీనింగ్ స్టేషనరీని ప్రభుత్వమే తప్పనిసరిగా సరఫరా చేయాలి,డి ఇ ఓ సంతకంతో కూడిన గుర్తింపు కార్డులు ఇవ్వాలని ,ఉపాధికి రక్షణ కల్పించాలని , ఉద్యోగ భద్రత కల్పించాలని ,ప్రతి నెల కనీసం రెండు పని రోజుల సెలవు ఇవ్వాలని ,గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు డిమాండ్ల సాధన కోసం ఏఐటీయూసీకి అనుబంధంగా ఉన్న లిఏపీ స్కూల్ ఆయా కార్మిక సంఘంలి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు సాగిస్తుందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసి సమస్యలపై చర్చించి, జీతాల పెంపు కోసం ప్రయత్నం చేస్తామని అన్నారు. అందుకు కార్మిక వర్గం కదిలి పోరాటాలకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు పోకూరు మురళి, తుమ్మల చైతన్య, నంద్యాల సరోజనమ్మ, యూనియన్ నాయకులు కమలమ్మ, గంగాదేవి, సుబ్బరత్నమ్మ మరియు స్కూల్ ఆయా కార్మికులు పాల్గొన్నారు.

# మిట్స్ వ్యవస్థాపకులు ఎన్.విజయ భాస్కర్ చౌదరికి సతీవియోగం

## - యూనివర్శిటీ అధ్యాపకులు,విద్యార్థుల దిగ్భ్రాంతి



మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వ్యవస్థాపకులు మరియు ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి సతీమణి,మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నాదెళ్ల లక్ష్మీరాజ్యం సోమవారం ఉదయం అనారోగ్య కారణాలతో ఆకస్మికంగా మృతిచెందారని యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. ఆమె మరణ వార్త మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ కుటుంబ సభ్యులను,అధ్యాపకులు,సిబ్బందిని,విద్యార్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. విద్యా సంస్థ అభివృద్ధి,పరిపాలనా వ్యవహారాలు మరియు విద్యార్థుల సంక్షేమం కోసం ఆమె అందించిన సేవలు,సహకారం చిరస్మరణీయమని యూనివర్సిటీ యాజమాన్యం పేర్కొంది. నాదెళ్ల లక్ష్మీరాజ్యం అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత మదనపల్లె సమీపంలోని ఋషి వ్యాలీ క్రాస్ వద్ద ఉన్న మిట్స్ ఫార్మ్‌హౌస్‌లో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ప్రతినిధులు,యాజమాన్యం, అధ్యాపకులు,బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు నాదెళ్ల లక్ష్మీరాజ్యం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరికి మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# డీఎస్సీపై యువతను తప్పుదోవ పట్టిస్తున్న వైకాపా

## - చిత్తుగా ఓడిన మాజీ సీఎం జగన్ రెడ్డికి బుద్ధిరాలేదు

## - టీడీపీ పట్టణ అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజ

మదనపల్లె (ప్రజా సీమ) : యువతపై వైఎస్సార్సీపీ పార్టీ కుట్రలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేకపోయారని,కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా టీచర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేస్తే ఓర్వలేని గొడ్డలి పార్టీ విషప్రచారం చేస్తోందని మదనపల్లి పట్టణ టిడిపి అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్ తేజ ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతిభతో కష్టపడి ఉద్యోగాలు సాధించిన 16 వేల మంది టీచర్లను వైసీపీ అనుమానిస్తోందన్నారు. జ్యాబ్ క్యాలెండరు విడుదల చేయకుండా రాష్ట్ర యువతను మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మెగా డీఎస్సీ 2025కు మాత్రమే కాదు,దేశవ్యాప్తంగా జరిగే ప్రతిష్టాత్మక పరీక్షలు అన్నింటికీ టీసీఎస్ ఐయాన్ సిబిటీ వ్యవస్థనే ఉపయోగిస్తున్నారని గుర్తుచేశారు. ఎందుకంటే ఇందులో 256 బిట్ ఎన్ క్రిప్షన్,మల్టీ లెవెల్ సెక్యూరిటీ,పూర్తి ఆడిట్ ట్రయల్స్,సర్వర్ లాగ్స్,యూజర్ ట్రేసబిలిటీ వంటి అత్యాధునిక భద్రతా ప్రమాణాలు ఇందులో




ఉన్నాయి. వీటి గురించి జగన్ కు చెప్పినా,చదువుకోలేదు కాబట్టి అర్థం చేసుకోలేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ టౌన్ జనరల్ సెక్రటరీ రామాంజనేయులు,క్లస్టర్ ఇంచార్జి సోమశేఖర్ నాయుడు,రాజకుమార్ రెడ్డి,వార్డు ప్రెసిడెంట్ రెడ్డి కుమార్,శ్రీరాములు,తెలుగు యువత అధ్యక్షులు ప్రణయ్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి

## -వైఎస్సార్‌సీపీ టీయూసీ నాయకులు సింగమాల సతీష్ రెడ్డి డిమాండ్.




రైల్వే కోడూరు (ప్రజాసీమ): రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు తోడు గృహ వినియోగ మరియు కమర్షియల్, మినీ గ్యాస్ సిలిండర్ల ధరలు కూడా పెరగడంతో సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని వైఎస్సార్‌సీపీ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు సింగమాల సతీష్ రెడ్డి (రామచంద్రారెడ్డి) ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు నిత్యావసరంగా వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల కుటుంబాల నెలవారీ బడ్జెట్ పూర్తిగా దెబ్బతింటోందన్నారు. ఒకప్పుడు వంట గ్యాస్ కుటుంబాలకు అవసరమైన సౌకర్యంగా ఉండగా, ఇప్పుడు పెరిగిన ధరల కారణంగా గ్యాస్ బండ కాస్త గుదిబండగా మారిందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, గ్యాస్ ధరల పెంపు మరింత భారంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని, లేకపోతే మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు కొనుగోళ్లు చేయలేని పరిస్థితి నెలకొందని, జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయిందని పేర్కొన్నారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని, వాహనాల వినియోగాన్ని తగ్గించి నడిచి వెళ్లాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సూచించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు సలహాలు ఇచ్చే ముందు వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గిస్తే రవాణా ఖర్చులు తగ్గి, నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ప్రభావం చూపి ప్రజలకు కొంత ఉపశమనం లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా జూన్ 12 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, షూస్, బ్యాగులు తదితర విద్యా సామగ్రి సిద్ధంగా ఉందా లేదా అనే సందేహాలు తల్లిదండ్రుల్లో నెలకొన్నాయని అన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు విద్యార్థులకు అవసరమైన సామగ్రి పంపిణీపై స్పష్టత ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, పాఠ్యసామగ్రి పంపిణీపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సింగమాల సతీష్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.


# పంజం రామలక్ష్మమ్మకు నివాళులర్పించిన ముక్కా వరలక్ష్మి



రైల్వే కోడూరు (ప్రజా సీమ ) తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలం అనంతరాజుపేట పంచాయతీ తూర్పుపల్లి గ్రామ వాస్తవ్యులు పంజం వేణుగోపాల్ రెడ్డి , స్వర్గీయ పంజం సుకుమార్ రెడ్డిల మాతృమూర్తి పంజం రామలక్ష్మమ్మ స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకున్న రైల్వే కోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి పందెం రామ లక్ష్మమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# నీలం కు భారతరత్న ప్రకటించాలి

## - డా.తులసిరెడ్డి



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డికీ భారతరత్న ప్రదానం చేయాలని కాంగ్రెస్ మీడియా చైర్మన్ డా.నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. సోమవారం నీలం సంజీవరెడ్డి 30వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ భారత రాజకీయాల్లో సంజీవరెడ్డి ఒక విశిష్టమైన, విలక్షణమైన నాయకుడని కొనియాడారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, పటిష్టతకు ఎంతో కృషి చేశారన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ లు, శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయం ఆయన మానస పుత్రిక లని, రాజకీయాల్లో నైతిక విలువలకు ఎక్కువ ప్రాముఖ్యతను ఇచ్చారన్నారు. స్వయంకృషి, స్వీయ ప్రతిభకు నిలువెత్తు నిదర్శనం నీలం సంజీవరెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, బద్రీ, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పేదలకు భరోసా

## - సింగిల్ విండో అధ్యక్షులు దారపునేనీ దశరథ రామానాయుడు



సిద్ధవటం ( ప్రజా సీమ) : సిద్ధవటం మండలంలోని జంగాలపల్లి పంచాయతీలోనే కమ్మ పాలెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వృద్ధులకు వికలాంగులకు దివ్యాంగులకు వితంతువులకు చెప్పిన మాట ప్రకారం రాష్ట్ర బడ్జెట్ లోటుగా ఉన్నా కూడా ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కంటే ముందే పెన్షన్ పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని రాజంపేట నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి చమర్తి జగన్మోహన్ రాజు ఆదేశాలతో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నా సింగిల్ విండో అధ్యక్షులు దారపునేని దశరథ రామానాయుడు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సిద్ధవటం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు, రవీంద్రబాబు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

# జ్యోతి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

## -కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం
## -ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమం
## -టిడిపి రాష్ట్ర కార్యదర్శి,ఎస్ మోహన్ రెడ్డి





సిద్ధవటం (ప్రజా సిమ): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శనివారం మోహన్ రెడ్డి తెలిపారు సిద్ధవటం మండలంలోని,జ్యోతి గ్రామం, ఎస్టీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఒక వరము లాంటిదని దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు 4,000/6,000/10,000 అందించడం ఒక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఉన్నదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కే సాధ్యమని ఇది కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ఆయన అన్నారు గత ప్రభుత్వం మాటలకే పరిమితం అయిందని ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని ఆయన అన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి వైపు దూసుకెళ్తుందని అటు కేంద్రము ఇటు రాష్ట్రం సహాయ సహకారాలతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలియజేశారు

# నాయకుల గొప్పలు.. ఊరు చూస్తే దిబ్బలు

## - అధికారులు, పాలకుల నిర్లక్ష్యం - ఆప్ జిల్లా కోఆర్డినేటర్ రహంతుల్లా



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:అధికార నాయకులు మాత్రం తమ తమ గొప్పలు చెప్పుకోవడం ఓ వైపు ఉంటే మరోవైపు వేంపల్లె గ్రామ పంచాయతీ అంతా ఎక్కడ చూసినా చెత్త చెదారాల దిబ్బలు దర్శనమిస్తున్నట్లు ఆమ్ఆద్మీపార్టీ జిల్లా కోఆర్డినేటర్ రహంతుల్లా తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పంచాయతీ పరిధిలోని ఆయా చెత్త చెదారాల ప్రాంతాల్లో పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలు అంగుళం దాటకున్న పాలక నాయకుల మాటలు మాత్రం ఆకాశాన్ని తాకుతూ ఉన్నాయని ధ్వజమెత్తారు. ఎక్కడ చూసినా చెత్త చెదారం, మురికి నీరు, దోమల, పందుల బెడద తీవ్రంగా ఉన్నాయని మండిపడ్డారు. ఇది ముమ్మాటికి అధికారులు, పాలకుల నిర్లక్ష్యమే అని అన్నారు. అధికార పాలకులకు ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే పంచాయతీలో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై చర్యలు చేపట్టాలని, ప్రజలకు మెరుగైన పాలన అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ జిల్లా సహాయ కన్వీనర్ దాదాపీర్, సభ్యులు పీరుబాషా, గౌస్, షఫీ, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## - టిడిపి ఇంఛార్జీ బిటెక్ రవి



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:ప్రజా సమస్యలపై దృష్టి సారించి, వీటి పరిష్కారమే టిడిపి కూటమి ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముసల్ రెడ్డిగారిపల్లి గ్రామంలో మండల ఇంఛార్జీ రఘునాథ్ రెడ్డి, కన్వీనర్ రామమునిరెడ్డి లతో కలిసి తాగునీటి బోరును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ముసల్ రెడ్డిగారిపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్ ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి పరిష్కారం చేయడమే తన ధ్యేయమన్నారు. అభివృద్ధి పనుల్లో రాజీ పడకుండా నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహమ్మద్ షబ్బీర్, చంద్రశేఖర్ రెడ్డి(దిల్మాంగే), రామగంగిరెడ్డి, రామాంజీరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, దక్కారమేష్, మడక శ్రీను, మాబుషరీఫ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాధవరంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

## -రాష్ట్ర స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు





సిద్ధవటం( ప్రజా సీమ): సిద్ధవటం మండలం రాజంపేట నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలోమాధవరం గ్రామపంచాయతీ మాధవరం1 గ్రామంలో సోమవారం ఉదయం 6 గంటల నుంచి తెల్లవారకముందే పేదలకు ఎన్టీఆర్ వితంతు వికలాంగులు పింఛన్ భరోసా కార్యక్రమంలో పాల్గొన్నరాష్ట్ర స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు గారు దేశంలో ఎక్కడ లేని విధంగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే వికలాంగులకు 6000, డయాలసిస్ పేషెంట్లకు 10000, వితంతువులకు 4000 పంచడం గర్వించదగ్గ విషయమని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు దూసుకెళుతుందని రాష్ట్ర రాజధాని అమరావతి ఎంతో డెవలప్మెంట్ జరుగుతుందని వారన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోసం అహర్నిశలు పెట్టుబడుల కోసం చంద్రబాబు నాయుడు గారు , నారా లోకేష్ గారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డెవలప్ కావాలని అహర్నిశలు కష్టపడుతున్నారని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ శ్రేణుల సమక్షంలో డాక్టర్ ఎస్.కే.బాషా జన్మదిన వేడుకలు

## - ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం,మందులు పంపిణీ - శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు






మదనపల్లె (ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు,ముస్లిం ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ గౌరవ సలహాదారులు డాక్టర్ ఎస్.కే.బాషా జన్మదిన వేడుకలు ఆయన కార్యాలయంలో పార్టీ నాయకులు,అభిమానుల సమక్షంలో నిరాడంబరంగా జరుపుకున్నారు.సోమవారం అగర్త వీధిలోని తమ కార్యాలయం నందు పుట్టినరోజు సందర్భంగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ శిబిరానికి హాజరైన రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ముఖ్యంగా,బిపి,షుగర్,మోకాళ్ళ నొప్పులు మరియు ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు అవసరమైన ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేయడంతోపాటు ఆరోగ్య నియమాలను తెలియజేశారు.అనంతరం అభిమానులు,ముఖ్య నాయకుల సమక్షంలో డాక్టర్ ఎస్.కే.బాషా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.ఇందులోభాగంగా హాజరైన ప్రముఖులు ఆయనకు పూల మాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కొండుపల్లి ఆనంద్,డిసిసి ప్రధాన కార్యదర్శి సమీరుద్దీన్,నాయకులు సురేంద్ర రెడ్డిలు మాట్లాడుతూ డాక్టర్ ఎస్.కే బాషా జన్మదినాన్ని పురస్కరించుకొని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఆయనకు అల్లా ఆయురారోగ్యాలను ప్రసాదించి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా తన పుట్టినరోజున ఉచితంగా పేదలకు వైద్య సేవలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీనిఅభివృద్ధి పథంలో నడిపించడానికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు.అనంతరం డాక్టర్ ఎస్.కె బాషా స్పందిస్తూ తన పుట్టినరోజు కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.తాను జీవిత కాలం కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తూ రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేసే లక్ష్యంలో భాగంగా సేవలు అందిస్తామన్నారు. అంతేకాకుండా ఆయుర్వేద వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడానికి ఉచిత వైద్య శిబిరాలను మరిన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అజ్మతుల్లా ఖాన్ ఫక్రుద్దీన్,రవీంద్ర,వసీంతోపాటు అభిమానులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరం

## - శ్రీ నిత్య పూజ స్వామి దేవస్థానం చైర్మన్ జంగిటి రాజేంద్రప్రసాద్ యాదవ్



సిద్ధవటం( ప్రజా సీమ) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రాజంపేట నియోజకవర్గం ఇంచార్జ్ జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని శ్రీ నిత్య పూజ స్వామి టెంపుల్ చైర్మన్ జంగటి రాజేంద్రప్రసాద్ వంతాటిపల్లి గ్రామపంచాయతీలో సచివాలయ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజలు,లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# మిట్స్ యూనివర్శిటీలో ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం

## - హాజరైన ఎన్.సి.సి ఎయిర్ వింగ్ కేర్ టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి



మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు ఎన్.సి.సి ఎయిర్ వింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పొగాకు రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్.సి.సి ఎయిర్ వింగ్ కేర్ టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి మాట్లాడుతూ పొగాకు వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన పెంచడం మరియు విద్యార్థులు,అధ్యాపకులు సమాజంలో పొగాకు రహిత జీవనశైలిని ప్రోత్సహించడం ముఖ్యమని ఆయన అన్నారు. ఆరోగ్యకరమైన జీవనానికి రాయబారులుగా మారాలని మరియు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండేలా వారి సహచరులను మరియు కుటుంబ సభ్యులను ప్రభావితం చేయాలని ఆయన విద్యార్థులకు తెలిపారు. యువత మార్పుకు మార్గదర్శకులు అని పొగాకు రహిత తరం ఆరోగ్యకరమైన జీవనానికి నాంది అన్నారు. సిగరెట్ తాగడం,పొగాకు నమలడం, రెండు రూపాలు సమానంగా ప్రాణాంతకమని,ఒకే తేడా ఏమిటంటే ధూమపానం ప్రభావాలు మొత్తం శరీరంపై త్వరగా కనిపిస్తాయని,అయితే పొగలేని పొగాకు నోరు,గొంతు నుండి ప్రారంభించి శరీరాన్ని నెమ్మదిగా నాశనం చేస్తుందన్నారు. పొగాకు ఏ రూపంలో వినియోగించినా అది గుండె,ఊపిరితిత్తులు మరియు శరీరంలోని ప్రతి కణాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. దానిని వదిలివేయడమే ఉత్తమ పరిష్కారమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల సారధి సీఎం చంద్రబాబు నాయుడు

## - ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా ప్రశంసలు
## - 9వ వార్డులో రాటకొండ భారతి ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ

మదనపల్లె (ప్రజా సీమ) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాల సారధి అని ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా పేర్కొన్నారు. సోమవారం 9వ వార్డు పరిధిలోని సుభాష్ రోడ్డు నందు వార్డు ఇంచార్జ్ రాటకొండ భారతి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సీఎం చంద్రబాబు ప్రజల జీవితాలలో వెలుగులు నింపుతున్నారని,ముఖ్యంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో అవ్వ,తాతలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం దేశానికే తలమానికమన్నారు. అనంతరం వార్డు ఇంచార్జ్ రాటకొండ భారతి మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీ అవ్వ,తాతలు,దివ్యాంగులు వితంతువులు,దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు,ఒంటరి మహిళలకు పెన్షన్లు అందజేసి వారి జీవితాల్లో ఆనందం నింపుతున్నామన్నారు. రాష్ట్ర



ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకున్నప్పటికీ సంక్షేమ పథకాలు అమలులో కూటమి వెనక్కి తగ్గడం లేదన్నారు. ప్రజల అభిమాన నాయకుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా నేతృత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి,సంక్షేమం పరుగులు పెడుతున్నాయన్నారు. ఆయన సారథ్యంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రమీల,టిడిపి నాయకులు నాదెళ్ల విద్యాసాగర్,రాటకొండ మధుబాబు,నవీన్ చౌదరి,నాదెళ్ల రమేష్,విజయమ్మ,శ్రీరామ నాగమణి,జెసిబి వేణు మరియు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలకడ మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

## - క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీడీఓ భాను ప్రసాద్



కలకడ(ప్రజా సీమ):కలకడ మండలంలో మే నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. మండలంలోని అన్ని రకాల పెన్షన్లు కలిపి 5,308 మంది లబ్ధిదారులకు రూ. 2,26,86,000 నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. మండల పరిధిలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో 94 మంది పెన్షన్ పంపిణీ అధికారులు ఇంటింటికీ వెళ్లి పెన్షన్ల పంపిణీ చేపట్టారు. అయితే కేంద్ర సర్వర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యల కారణంగా పంపిణీ ప్రక్రియ కొంత మందగించినప్పటికీ, ఈ రోజు సాయంత్రం వరకు 63.73 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. ఈ సందర్భంగా కలకడ మండలంలోని స్వర్ణ గ్రామంలో జరుగుతున్న పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ భాను ప్రసాద్ ప్రత్యక్షంగా పరిశీలించారు. లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిఓ శైలజ, గ్రామ సచివాలయ సిబ్బంది, పెన్షన్ పంపిణీ అధికారులు మరియు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు. మండలంలోని మిగిలిన లబ్ధిదారులకు కూడా త్వరితగతిన పెన్షన్లు అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా ఉష శ్రీ

## - కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ::స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొత్త ప్రిన్సిపాల్ గా సోమవారం డా.ఉషశ్రీ బాధ్యతలు చేపట్టారు. సోమవారం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ ఉషశ్రీ వృక్షశాస్త్రం విభాగధిపతిగా కాకినాడ జిల్లా పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తూ పదోన్నతిపై వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా విచ్చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధ్యాపకులు, సిబ్బంది సహాయ సహకారాలతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే 2026-27



విద్యా సంవత్సరానికి కళాశాల ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కళాశాలలో చేర్పించి, వీరి విద్యా అభివృద్ధికి దోహదం చేయాలనికోరారు. కళాశాలలోఅన్ని సౌకర్యాలతో కూడిన ఉన్నత విద్యను అందించేందుకుకృషిచేస్తామని తెలిపారు.

# ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు..

## -రూ.7 లక్షల నగదు, ఎలక్ట్రానిక్ పరికరాలు, మద్యం బాటిళ్లు స్వాధీనం
## - 11 మందిపై కేసు నమోదు -కడప ఇన్చార్జి డిఎస్పి బాలస్వామి రెడ్డి








కడప జూన్ 1 (ప్రజాసీమ) కడప జిల్లా పోలీసు అధికారి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాపై దాడులు నిర్వహించి ప్రధాన నిర్వాహకుడితో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఈ. బాలస్వామి రెడ్డి తెలిపారు. కడప డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. గత నెల 31వ తేదీ రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని శాస్త్రినగర్, అక్కాయపల్లిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. తనిఖీల సందర్భంగా ప్రధాన నిందితుడు ఇందిరెడ్డి జనార్ధన్ రెడ్డి తన నివాసంలో ఐపీఎల్--2026 ఫైనల్ మ్యాచ్ సందర్భంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌పై ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లు, వై-ఫై రూటర్‌లను ఉపయోగించి వివిధ ప్రాంతాల్లో ఉన్న సబ్ బుకీలకు యూజర్ ఐడీలు, వెబ్ లింకులు పంపించి ప్రజల నుంచి డబ్బులను పందెంగా స్వీకరిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఇందిరెడ్డి జనార్ధన్ రెడ్డి (అక్కాయపల్లి) కాగా, మాధవరెడ్డి (మోడమీదపల్లి), నరేష్ (పులివెందుల), గోల్డ్ శేఖర్ (నరసరావుపేట), గుగ్గిళ్ల చాణక్య (చెన్నూరు), రెడ్డయ్య రెడ్డి (చెన్నూరు), హరినాథ్ అలియాస్ శ్రీహరి (చెన్నూరు), ఆమంచి కళ్యాణ్ చక్రవర్తి (చెన్నూరు), షేక్ ఇంతియాజ్ (చెన్నూరు), జయప్రకాశ్ అలియాస్ చంటి (చెన్నూరు)లను సహ నిందితులుగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరితో పాటు మరికొంత మంది పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా బెట్టింగ్ కార్యకలాపాలకు వచ్చే వ్యక్తులను ఆకర్షించేందుకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం బాటిళ్లను అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ. 7,00,550 నగదు, ఒక ల్యాప్‌టాప్, ఐదు మొబైల్ ఫోన్లు, ఒక వై-ఫై రూటర్, ఒక నగదు లెక్కింపు యంత్రం, 750 మిల్లీలీటర్ల సామర్థ్యం గల 12 మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటిలో ఆరు గోవా మద్యం బాటిళ్లు, మరో ఆరు ఇతర బ్రాండ్ల మద్యం బాటిళ్లు ఉన్నాయని, మద్యం విలువ సుమారు రూ. 1 లక్ష వరకు ఉంటుందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదు, ఎలక్ట్రానిక్ పరికరాలు, మద్యం బాటిళ్లను కేసు ఆస్తిగా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్, అక్రమ మద్యం నిల్వ వ్యవహారాన్ని ఛేదించి కీలక ఆధారాలతో పాటు నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకోవడంలో విశేష కృషి చేసిన కడప తాలూకా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి. నరసింహరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. మహమ్మద్ రఫీతో పాటు దాడుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఈ. బాలస్వామి రెడ్డి ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు పాల్పడవద్దని, ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటారని డీఎస్పీ హెచ్చరించారు.

# విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ విఫలం

## - మెగా డీఎస్సీలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలి
## - వైకాపా యువజన విభాగం ఆధ్వర్యంలో మదనపల్లిలో నిరసన
## - హాజరైన పార్టీ ముఖ్య నేతలు,యువ నేతలు






మదనపల్లె (ప్రజా సీమ) : విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ విఫలమయ్యారని,మెగా డీఎస్సీలో అక్రమాలు లోకేష్ చలువేనని,సిఎంగా చంద్రబాబునాయుడు చేసిన తొలి సంతకం అక్రమాలకు నాంది పలికిందని వైఎస్సార్సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ విమర్శలు గుప్పించారు. వైకాపా యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కె.ఇర్ఫాన్,అన్నమయ్య జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు యలగచెర్ల శివప్రసాద్ రెడ్డి,మదనపల్లె నియోజకవర్గం అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లె జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి మదనపల్లె సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్,పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి,పరిశీలకురాలు అనూష రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నిరుద్యోగులు, డిఎస్సీ మెరిట్ లిస్ట్ కోసం పోరాట చేస్తున్న వారు,వైకాపా యువజన కార్యకర్తలు,విద్యార్థి విభాగం నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కూటమి ప్రభుత్వం నిర్వహించిన డిఎస్సీ అక్రమాలు నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం చేసిన మెగా డిఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని,ఇది మెగా డిఎస్సీ " కాదు,అవినీతి దగా డిఎస్సీ అని కూటమి ప్రభుత్వపై విమర్శలు గుప్పించారు. మంత్రి నారా లోకేష్ బాబు విద్యా శాఖ మంత్రిగా అనర్హుడని,డిఎస్సీ అక్రమాలకు ఆద్యుడని ఆరోపించారు. నిజాయితీ నిరూపించు కోవడానికి సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. డిఎస్సీ పరీక్షల నిర్వహణ,మార్కుల వెల్లడి,స్పోర్ట్స్ కోటా మరియు కాంట్రాక్ట్ ఉద్యోగులు పరీక్ష రాయడం,మెరిట్ లిస్ట్ ప్రకటించక పోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. మెరిట్ లిస్ట్ మాయం,స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు ఉద్యోగాలను అమ్ముకున్నానే ఆరోపణలు వచ్చాయని వాటిపై విద్యా శాఖ మంత్రిగా నారా లోకేష్ స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నారా లోకేష్ బాబుపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో రాజీనామా చేసి విచారణ కోరే దుమ్ముందా అని సిఎం చంద్రబాబునాయుడుకి సవాల్ విసిరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి డిఎస్సీ పరీక్ష రాసి ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోవడం,అతన్ని ఉద్యోగం నుంచి తొలగించడం,మెరిట్ లిస్ట్ మాయం చేయడం,స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని,డీఎస్సీ అక్రమాల ద్వారా నిజమైన,నిరుపేద,కష్టపడి పరీక్ష రాసిన వారికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారు రెండు వందల మంది కోర్టును ఆశ్రయించారని,అవకతవకలకు ఇదే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మేధావుల ఫోరం స్టేట్ జాయింట్ సెక్రెటరీ మయూరి రఘునాథరెడ్డి,యువజన విభాగం స్టేట్ జాయింట్ సెక్రటరీ కిషోర్ కుమార్ రెడ్డి,రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి లియాఖత్ అలీ,ఖాదర్ వలి,హేమంత్,పవన్,మిద్దింటి కిషోర్,వలసపల్లి నాగరాజ రెడ్డి,కొత్తవారిపల్లి మహేష్,శరత్ రెడ్డి,మజ్జిగ కేశవ యాదవ్,అశోక్ రాయల్,రామసముద్రం మండల యువజన విభాగం అధ్యక్షులు బాలాజీ,మహమ్మద్ యూనిస్,ఫిరోజ్,ఆనంద్ రెడ్డి,పీలేరు దావూద్,చక్రి,గౌతం,భాస్కర్,వాసు దేవత్రెడ్డి,రాజా,అభి,సాయి,దీపు,పూర్ణ,చౌడేపల్లి కల్యాణ్,శారదా రెడ్డి,షెహనాజ్,నాగమణి తదితరులు పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక


# నివాస పట్టాలు, అంబేడ్కర్ భవనం భూ కేటాయింపుపై కలెక్టర్‌కు వినతి




పీలేరు(ప్రజా సీమ):పీలేరు పట్టణంలోని సర్వే నంబర్ 139లో గత 60 ఏళ్లుగా నివసిస్తున్న పేద కుటుంబాలకు ఇంటి నివాస పట్టాలు మంజూరు చేయాలని, అలాగే అంబేడ్కర్ భవనం నిర్మాణానికి భూమి కేటాయింపుపై పెండింగ్‌లో ఉన్న చర్యలను వేగవంతం చేయాలని వివిధ సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, సర్వే నంబర్ 139లో నివసిస్తున్న ఆరు కుటుంబాలకు వెంటనే పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు.అలాగే దొడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిని అంబేడ్కర్ భవనం కోసం కేటాయించాలని, ఈ విషయంలో సాంఘిక సంక్షేమ శాఖజారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు తుమ్మల ధరణ్ కుమార్, ఎంఎస్పీ నాయకులు నడిమికండ్రిగ సుధాకర్ బాబు, జెట్టి మల్లికార్జున, సద్దల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పథకం తో పాటు భరోసా ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

## -రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు





రాజంపేట ,(ప్రజా సీమ):ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్నామని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.సోమవారం నాడు రాజంపేట పట్టణం ఈడిగ పాలెం వార్డు 2,5 నందు పర్యటిస్తూ "పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ " పంపిణీ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది/ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాల నిమిత్తం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను,అభివృద్ధి పనులను ప్రజలకు జగన్ మోహన్ రాజు వివరించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరిని ఆదుకుంటుందని చమర్తి తెలియజేశారు.అంతకుముందు పలువురు లబ్ధిదారుల ఇండ్ల వద్దకే వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని స్వయంగా చమర్తి జగన్ మోహన్ రాజు పెన్షన్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రతి నెల ఇలా పండుగ వాతావరణంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు,నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు లకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు/ పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్/ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంగల్ రాయుడు / క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు/ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్/కౌన్సిలర్ రాజేష్/ప్రముఖ డాక్టర్ నవీన్ చంద్ర/మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు/యూనిట్ ఇంచార్జ్ మహమ్మద్ అలీ/ లస్సి బాలాజీ/ ఎద్దులపల్లి బాలాజీ నాయుడు/ వార్డు అధ్యక్షులు భరత్/ జానీ బాషా/కేశవ / కరీముల్లా/ సన్నప్పనేని బాలాజీ/సచివాలయ సిబ్బంది/పలువురు పార్టీ ముఖ్య నాయకులు / పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# 40 రోజుల 'గో టూ విలేజ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## -ఎమ్మార్పీఎస్ అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ కోట దానియల్ మాదిగ



పీలేరు(ప్రజా సీమ):మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేపట్టిన "టార్గెట్-40 డేస్, గో టూ విలేజ్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి కోట దానియల్ మాదిగ పిలుపునిచ్చారు. పీలేరు మార్కెట్ యార్డులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎస్సీ వర్గీకరణ సాధన తర్వాత విద్య, ఉద్యోగాలు, ఉపాధి, రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి గ్రామంలో కమిటీలను బలోపేతం చేసి, జూలై 7 నాటికి జెండా దిమ్మెల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టాలని సూచించారు.అలాగే, మందకృష్ణ మాదిగ పేరు, ఎమ్మార్పీఎస్ పేరును ఉపయోగించుకొని కొందరు వ్యక్తులు సంస్థతో సంబంధం లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, వారికి ఎమ్మార్పీఎస్‌తో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.పీలేరు నియోజకవర్గంలో గండికోట వెంకటేష్, ముల్లంగి రెడ్డప్ప, ముదివేడు శ్రీనివాసులు, అమరాల వెంకటరమణ, దొడ్డి వెంకటాచలపతి తఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వై. రవీంద్ర మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగళ్ల శ్రీనివాసులు, వివిధ మండలాల ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టమోటా రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత

## - ఎమ్మెల్యే షాజహాన్ బాషా,ఏఎంసీ చైర్మన్ జంగాల శివరాం స్పష్టం





మదనపల్లె (ప్రజా సీమ) : టమోటా రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు.సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం ఆధ్వర్యంలో నిర్వహించిన మార్కెట్ కమిటీ జనరల్ బాడీ సమావేశానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఇందులో భాగంగా మార్కెట్ యార్డుకి వచ్చే రైతులకు విశ్రాంతి భవనం ఏర్పాటు,పురుషులకు మహిళలకు విడివిడిగా వాష్ రూంల నిర్మాణం చేపట్టడం,వేయింగ్ మిషన్ తొలగింపుకు కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.రానున్న సీజనులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.పాలకవర్గం తీర్మానం ప్రకారం కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సెక్రటరీ జగదీష్ కు ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల క్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. పురుషులు,మహిళలకు విడివిడిగా వాష్ రూంలను నిర్మించేందుకు ఈరోజే చర్యలు చేపట్టాలని తెలిపారు.అనంతరం చైర్మన్ జంగాల శివరాం మాట్లాడుతూ జాతీయ రహదారిపై అక్రమాలకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.వైస్ చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ రైతుల కోసం మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయాలని కోరారు.ఎమ్మెల్యే షాజహాన్ బాషా సహకారంతో రానున్న సీజన్ సమస్యలు లేకుండా రైతులు,వ్యాపారస్తులకు మెరుగైన సేవలు అందించేందుకు మార్కెట్ కమిటీ పాలకవర్గం పనిచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శంకర్ నాయుడు,డాన్స్ రెడ్డి శేఖర్,చల్లా నరసింహులు,మున్నా నాయక్,సిటిఎం జిలాని,సుబ్రహ్మణ్యం రెడ్డి,శ్యామలమ్మ,ఓబయ్య,తెలుగుదేశం నాయకులు జెసిబి వేణు,సురేందర్ రెడ్డి,రామిశెట్టి కృష్ణ (కమలా మణి),బాలమాలి శేఖర్,రమేష్ రెడ్డి,కాశీ శ్రీరామ్ వాల్మీకి,ప్రభాకర్,పసుపులేటి శ్రీనివాసులు,హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి దోహద పడాలి

## - ఎంఇఓ-2 స్టాలిన్ ఐజాక్




వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మధ్య సమన్వయం, సహకారంతో పాఠశాల అభివృద్ధికి దోహద పడాలని ఎంఇఓ-2 స్టాలిన్ ఐజాక్ అన్నారు. సోమవారం స్థానిక ఉర్దూ ప్రభుత్వ పాఠశాలలో బడి పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఇతరత్రా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మునెమ్మ, ఉపాధ్యాయులు షకిలా, ఫరీదాబాను, పద్మావతి, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత ప్రామాణికంగా పిజిఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి

## - అధికారులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశం





మదనపల్లె (ప్రజా సీమ) : నాణ్యతే ప్రామాణికంగా పిజిఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలని మదనపల్లి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరుతోపాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ,మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా,నాణ్యతగా అర్జీలను పరిష్కరించాలన్నారు.ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని,ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు.బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి అర్జీలు వెళ్లకుండా నిర్దేశిత గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.పుంగనూరు పట్టణానికి చెందిన పివన్ సుదర్శన్ తనకు చెవుడు వచ్చినందున ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకున్నానని,డాక్టర్లు పరిశీలించి చెవుడు సర్టిఫికేట్ ఇవ్వడం జరిగిందని,చెవిటి మిషన్ మంజూరు చేయాల్సిందిగా కలెక్టరుకి విన్నవించుకున్నారు.చౌడేపల్లి మండలం,దిగువపల్లి గ్రామం,బోయకొండ సమీపం యానాది కాలనీలో నివసించే ఎన్.మల్లికార్జున ధ్రువీకరణ పత్రంలో కులం తప్పుగా నమోదయిందని,పరిశీలించి కుల సర్టిఫికెట్ జారీ చేయాలని కలెక్టరుకు దరఖాస్తును సమర్పించారు.మదనపల్లి పట్టణం అమ్మచెరువు మిట్ట లాయర్ ఏసి గోడౌన్ వద్ద నివసించే బి.మల్లికార్జున,ఇటీవల తన భార్య చనిపోగా తాను ఒంటరిగా జీవిస్తున్నానని,తనకు ఏ ఆధారం లేదని,గతంలో తనకు వస్తూ ఉన్న పెన్షనుని ఆపివేశారని,ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తనను పెన్షన్ను పునరుద్ధరించి ఆదుకోవాలని కలెక్టరుకు దరఖాస్తును సమర్పించారు.ఈ కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై మొత్తంగా 280 అర్జీలను దరఖాస్తుదారులు సమర్పించారు.ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి

## -నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు, కాడే చెంచయ్య నాయుడు



సిద్ధవటం (ప్రజా సీమ ) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వితంతువులకు, వికలాంగులకు పెద్ద కొడుకులా ప్రతినెల అర్హులైన పెన్షన్ దారులకు వారి ఇంటి వద్దనే వేకువ జామునే పెన్షన్ పంపిణీ చేస్తున్నారని బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు చెంచయ్య నాయుడు పేర్కొన్నారు మండలంలోని మిట్టపల్లి గ్రామంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి నాంది పలుకుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వృద్ధులకు వయోవృద్ధులకు వితంతువులకు దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేయడం పట్ల ఇతర రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు ఏపీ వైపు చూస్తున్నారని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో , ఏ ఓబులేష్ నాయుడు, సచివాలయ ఉద్యోగులు టిడిపి నేతలు పాల్గొన్నారు

# కలకడ శాఖా గ్రంథాలయాన్ని సందర్శించిన ఎంపీడీఓ



కలకడ(ప్రజా సీమ)అన్నమయ్య జిల్లా గ్రంథాలయ సంస్థకు అనుబంధంగా ఉన్న కలకడ శాఖా గ్రంథాలయాన్ని సోమవారం ఎంపీడీఓ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, పత్రికలు, పిల్లల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను పరిశీలించారు.ప్రస్తుతం జూన్ 6వ తేదీ వరకు చిన్నారుల కోసం విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందించే ప్రత్యేక సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు అమర్‌నాథ్ తెలిపారు. పిల్లలకు విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం వివిధ మ్యాగజైన్లు, దినపత్రికలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.అదేవిధంగా చిన్నారుల వినోదం కోసం చెస్, క్యారమ్స్, లూడో వంటి ఆటలను కూడా గ్రంథాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రంథాలయ సేవలను మరింత విస్తరించేలా ప్రజలకు ఉపయోగపడే మరిన్ని మ్యాగజైన్లను అందుబాటులో ఉంచాలని ఎంపీడీఓ సూచించారు.గ్రంథాలయం ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.కలకడ మండల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు మరియు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

# బాధితులకు తక్షణ న్యాయమే పోలీసుల లక్ష్యం

## - చట్టపరిధిలో గల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
## - జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ సూచనలు

మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి దృష్టికి తీసుకెళ్లారు.స్వయంగా అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడిన ఎస్పీ,వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రధానంగా కుటుంబ కలహాలు,సైబర్ మోసాలు,తల్లిదండ్రులపై వేధింపులు,గృహహింస, భూవివాదాలు,నకిలీ పత్రాల సృష్టి,అధిక వడ్డీల వేధింపులు,ఆన్‌లైన్ మరియు ప్రేమ పేరుతో జరిగిన మోసాలపై బాధితులు ఎస్పీకి స్వేచ్ఛగా విన్నవించుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత అధికారులతో అప్పటికప్పుడే ఫోన్‌లో మాట్లాడి,బాధితులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికను వెంటనే జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయా



నికి పంపాలని ఆదేశించారు.ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు,మహిళల ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యతనిచ్చి తక్షణవే విచారణ జరపాలని అధికారులకు సూచించారు.జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు తమ స్థానిక పోలీస్ స్టేషన్లు,సర్కిల్ లేదా సబ్ డివిజన్ కార్యాలయాల్లో సైతం ఫిర్యాదు చేయవచ్చని,ఆయా ఫిర్యాదులను కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలుగానే పరిగణించి సకాలంలో న్యాయం చేస్తామని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ప్రజలకు భరోసానిచ్చారు.

# నేకనాపురం పంచాయతీలో పేదల సేవలో పెన్షన్ కార్యక్రమం

## -టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రామచంద్ర



సిద్ధవటం( ప్రజా సీమ) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు నేకనాపురం పంచాయతీలో సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేశారు. ఈసందర్భంగా.వీరనాల రామచంద్రయ్య సిద్ధవటం మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పెన్షన్ లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ అందజేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తారని వీరనాల రామచంద్రయ్య తెలిపారు."పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం -- ప్రజాసేవే మా లక్ష్యం" అని ఆయన అన్నారు.

# దేశానికే దిక్సూచిలా సీఎం చంద్రబాబు నాయుడు పాలన

## - టిడిపి నాయకులు నాగూర్ వలి ప్రశంసలు
## - 14వ వార్డులో లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ

మదనపల్లె (ప్రజా సీమ) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన దేశానికి దిక్సూచిగా నిలుస్తోందని తెలుగుదేశం నేత,ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి (షో ఆఫ్ శీనా) పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని 14వ వార్డు పరిధిలో లబ్ధిదారులకు ఆయన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాగూర్ వలి మాట్లాడుతూ సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేసి కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన సుదీర్ఘ అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు.ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్



బాబు తమవంతు సహకారం అందిస్తున్నారన్నారు. మదనపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా తనదైన ముద్ర వేస్తున్నారని,నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే కాకుండా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని ప్రశంసించారు.అటు సీఎం చంద్రబాబు నాయుడు,ఇటు ఎమ్మెల్యే షాజహాన్ బాషా సుపరిపాలన అందిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారని వెల్లడించారు.

# ప్రజా సంక్షేమం,మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు పెద్దపీట

## - టిడిపి రాష్ట్ర కార్యదర్శి తులసి రామకృష్ణ ప్రశంసలు - 20వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ









మదనపల్లె (ప్రజా సీమ) : ప్రజా సంక్షేమం మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపేట వేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి రామకృష్ణ పేర్కొన్నారు.రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం 20వ వార్డులో సామాజిక పింఛన్ల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్,సీనియర్ నాయకుడు ఇడ్లీ రాజు,క్లస్టర్ ఇన్‌చార్జి తాజ్ బాషాలు హాజరయ్యారు.ఈ సందర్భంగా పచ్చిపాల తులసి,పఠాన్ ఖాదర్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు ఇంటి వద్దకే సామాజిక పింఛన్లు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అక్షరాలా అమలు చేస్తూ,ప్రజల సంక్షేమాన్ని ప్రభుత్వ పాలనకు కేంద్రబిందువుగా మార్చిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడన్నారు.అవ్వాతాతల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం,వారి ఆశీర్వాదాలు,ప్రజల హర్షాతిరేక స్పందనే కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు.గతంలో సంక్షేమం పేరుతో ప్రచారం ఎక్కువగా,ఫలితాలు తక్కువగా ఉండేవని,కానీ నేడు ప్రజల గడప వద్దకు వెళ్లి నగదు రూపంలో పింఛన్లు అందించడం ద్వారా ప్రభుత్వం నిజమైన ప్రజా పాలనను అందిస్తోందని చెప్పారు.పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువనేతనారా లోకేశ్ బాబు,ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి,సంక్షేమం అనే రెండు చక్రాలపై ముందుకు సాగుతోందన్నారు.పేదల ముఖాల్లో చిరునవ్వు కనిపించడమే మా రాజకీయాల లక్ష్యమని స్పష్టం చేశారు.అవ్వాతాతల ఆశీర్వాదాలే కూటమి ప్రభుత్వానికి నిజమైన బలమని,ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం ద్వారా కూటమి ప్రభుత్వం విశ్వసనీయ పాలనకు చిరునామాగా నిలిచిందని వారు స్పష్టం చేశారు.

# హకీకా (కేశఖండన) కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి.





కలకడ (ప్రజా సీమ)పీలేరు నియోజకవర్గంలోని మండలం కలకడలో ఇబ్రహీం సాహెబ్ ఆత్మీయ ఆహ్వానం మేరకు వారి మనవళ్ల హకీకా (కేశఖండన) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మదనపల్లి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ చిన్నారులు ఆరోగ్యంగా, ఉన్నత విద్యను అభ్యసించి కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, మదనపల్లి వైఎస్సార్సీపీ యువ నాయకుడు హర్షవర్ధన్ రెడ్డి, అసెంబ్లీ ముస్లిం మైనారిటీ వింగ్ ప్రెసిడెంట్ మస్తాన్, కలకడ యువ నాయకులు ముబారక్, షేక్, మహమ్మద్ నూరు తదితరులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. అలాగే స్థానిక నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అనంతరం అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేయగా, ఆత్మీయ వాతావరణంలో

# నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న కూటమి సర్కార్

## - వైకాపా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి ఆగ్రహం
## - మదనపల్లిలో యువత పోరు సూపర్ సక్సెస్



మదనపల్లె (ప్రజా సీమ) : కూటమి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన దగా డిఎస్సిని రద్దు చేయాలని కోరుతూ అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్సిపి యువజన విభాగం అధ్యక్షులు యలగచెర్ల శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమం పెద్దఎత్తున విజయవంతమైంది.సోమవారం జిల్లా కేంద్రమైన మదనపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో వైఎస్ఆర్సిపి యూత్ నాయకులు,ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై ప్రతిభావంతులైన నిరుద్యోగ యువతకు అన్యాయం చేసిన దగా డిఎస్సిని రద్దు చేయాలని కోరుతూ భారీఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ముందుగా మదనపల్లి కలెక్టరేట్ కార్యాలయం ముందు వైఎస్ఆర్సీపీ శ్రేణులు భారీ ఎత్తున హాజరై నిరసన కార్యక్రమాన్ని తలపెట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి,మదనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి పరిశీలకురాలు నూతన కాలువ అనుషా రెడ్డి,మదనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్,వైయస్సార్సీపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మిద్దింటి కిషోర్,వైఎస్ఆర్సిపి రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి మయూరి రఘునాథరెడ్డి,వైసిపి యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ ఇర్ఫాన్,మదనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి యూత్ అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ కేవలం డబ్బులు దోచుకోవడానికే మెగా డీఎస్సీని ప్రవేశపెట్టారని తెలిపారు.ప్రతిభావంతులను పక్కనపెట్టి లక్షలు వెచ్చించిన అభ్యర్థులకు టీచర్ ఉద్యోగాలు కట్టబెట్టారని



ఆరోపించారు.ప్రతిభావంతులను పక్కనపెట్టి ఎవరైతే నోట్ల కట్టలు ఇచ్చారో వారికే ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చారని ఆగ్రహం చెందారు.కూటమి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన దగా డీఎస్సీని వెంటనే రద్దు చేయాలని,తిరిగి నిజాయితీగా డీఎస్సీ నిర్వహించి అర్హులైన వారికి టీచర్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలవుతున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు.వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని,దగా డీఎస్సీని రద్దు చేయాలని,అర్హులైన నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు,సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి యూత్ నాయకులు వలసపల్లి నాగరాజ రెడ్డి,మాజీ సర్పంచులు మహేష్ బాబు,శరత్ రెడ్డి,పవన్ తేజ,బాలాజీ,మేదర సుబ్బు,తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం



# ఓట్స్ అధికంగా తింటే అనర్థాలు.. జాగ్రత్త!

ఓట్స్... చాలామంది ప్రతిరోజూ ఓట్స్ తింటూ ఉంటారు. ఓట్స్ తో మంచి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని భావిస్తారు. ఓట్స్ లో విటమిన్ బి2, విటమిన్ సి, పీచు పదార్థం, పిండి పదార్థాలు, మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. ఓట్స్ చాలా మంచి పౌష్టికాహారంగా చెప్పవచ్చు.

**అతిగా ఓట్స్ తింటే అనర్థాలు**

ఇక ఓట్స్ తింటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి అన్నమాట ఎంత వాస్తవమో అతిగా తింటే అనారోగ్యం కూడా వస్తుంది అనే విషయం అంతే వాస్తవం. ఇక ఓట్స్ తినడం వల్ల కలిగే అనారోగ్యాలు, మన శరీరానికి కలిగే నష్టాలు ఏమిటో ప్రస్తుతం తెలుసుకుందాం.ఓట్స్ అతిగా తినడం వల్ల అనేక అనారోగ్యాలు వస్తాయి. అధికంగా ఓట్స్ తిన్న వారిలో కొంతమందికి కడుపు ఉబ్బరం మరియు గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి.

**అధికంగా ఓట్స్ తింటే ఆరోగ్య సమస్యలు**

ఓట్స్ జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. అందుకే ఓట్స్ అధికంగా తినడం మంచిదికాదు. ఓట్స్ లోని ఫైటిక్ యాసిడ్ క్యాల్షియం ,ఇనుము మరియు జింక్ వంటి కొన్ని ఖనిజాల శోషణను నిరోధిస్తుంది. ఓట్స్ అధికంగా తిన్నవారు మలబద్ధకం వంటి సమస్యలతో ఇబ్బంది పడతారు. కొంతమందికి ఓట్స్ లో ఉండే ప్రోటీన్ కారణంగా అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంది.

**ఓట్స్ పదేపదే తింటే ఇన్ఫెక్షన్స్**

ఓట్స్ ను సరిగ్గా శుభ్రం చేయకపోతే, అవి తిన్నవారికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం లేకపోలేదు. పోషకాలు బాగా ఉంటాయని అతిగా ఓట్స్ తినడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉ ంటుంది. ఓట్స్ ప్రతిరోజు తీసుకోవడం వల్ల చాలామందిలో కడుపుకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఓట్స్ ఎక్కువగా తినడం వల్ల వాటిలో క్యాలరీలు తక్కువగా ఉండటం కారణంగా మన శరీరంలో కూడా క్యాలరీల లోపం ఏర్పడే అవకాశం ఉంది.

మితంగా తింటే ఆరోగ్యం కాబట్టి ఓట్స్ ను తినాలి అని అనుకుంటే ఒక నియమిత పద్ధతిలో తినడం మంచిది. ప్రతిరోజు బ్రేక్ ఫాస్ట్ గా ఓట్స్ మాత్రమే తినడం మంచిది కాదు. ఆరోగ్యానికి మేలు చేకూర్చే ఓట్స్ అధికంగా తింటే కొన్ని దుష్ప్రభావాలు వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకొని తదనుగుణంగా మితంగా తింటే మంచిది.

# పాలక్ కోకోనట్ రైస్..తక్కువ టైంలో ఎక్కువ రుచి..ఎలా చేసుకోవాలంటే






పాలక్ కోకోనట్ రైస్ రైస్ ఒక సుగంధభరితమైన, రుచికరమైన వంటకం. ఇది పాలకూర, కొబ్బరి పాల కలయికతో ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. ఇది లంచ్ బాక్స్ ల్లోకి, తేలికపాటి భోజనానికి లేదా ప్రత్యేక సందర్భాలలో వడ్డించడానికి కూడా చాలా బాగుంటుంది. దీనిని తయారు చేయడం చాలా సులభం, తక్కువ సమయంలోనే సిద్ధం చేసుకోవచ్చు. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు -బాస్మతి బియ్యం - 2 కప్పులు -పాలకూర - 2 కప్పులు -కొబ్బరి పాలు - 1.5 కప్పులు -ఉల్లిపాయ - 1 పెద్దది -పచ్చిమిర్చి - 2-3 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూన్ -ఆవాలు - 1 టీ స్పూన్ -జీలకర్ర - 1/2 టీ స్పూన్ -మినపప్పు - 1/2 టీ స్పూన్ -శనగపప్పు - 1/2 టీ స్పూన్ -ఎండుమిర్చి - 2 -కరివేపాకు - 1 రెమ్మ -నూనె లేదా నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు -పసుపు - 1/4 టీ స్పూన్ -ఉప్పు - రుచికి సరిపడా -కొత్తిమీర - గార్నిష్ కోసం -జీడిపప్పు - 1 టేబుల్ స్పూన్ -నిమ్మరసం - కొన్ని చుక్కలు.

తయారీ విధానం -ముందుగా బాస్మతి బియ్యాన్ని 2-3 సార్లు శుభ్రంగా కడిగి అరగంటసేపు నీటిలో నానబెట్టండి. -తర్వాత పాలకూరను శుభ్రంగా కడిగి సన్నగా తరిగి పక్కన పెట్టుకోండి. మీరు కావాలనుకుంటే పాలకూరను కొద్దిగా ఉడికించి లేదా ఆవిరిలో మగ్గించి కూడా ఉపయోగించవచ్చు. -ఇప్పుడు ఉల్లిపాయను సన్నగా తరుగుకోండి. పచ్చిమిర్చిని మధ్యకు చీల్చండి. అల్లం,వెల్లుల్లిని మెత్తని పేస్ట్లా చేసుకోవాలి. ఎండుమిర్చిని చిన్న ముక్కలుగా తుంచుకోండి. -స్టవ్ మీద ఒక మందపాటి అడుగు కలిగిన గిన్నె లేదా కుక్కర్ పెట్టి అందులో నూనె లేదా నెయ్యి వేసి వేడి చేయండి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు వేసి చిటపటలాడనివ్వండి. తర్వాత జీలకర్ర, మినపప్పు, శనగపప్పు వేసి అవి కొద్దిగా రంగు మారే వరకు వేయించండి. ఇప్పుడు ఎండుమిర్చి,కరివేపాకు వేసి వేయించండి. తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి అవి బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించాలి. -ఉల్లిపాయలు వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు ఇందులో తరిగిన పాలకూర వేసి 2-3 నిమిషాలు లేదా అది మెత్తబడే వరకు ఉడికించాలి. -పాలకూర మగ్గిన తర్వాత కొబ్బరి పాలు పోయాలి. తర్వాత నానబెట్టిన బియ్యంలోని నీటిని వడగట్టి బియ్యం వేయాలి. పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపండి. -గిన్నెకు మూత పెట్టి లేదా కుక్కర్ మూత పెట్టి మీడియం మంట మీద ఉడికించాలి. మీరు గిన్నెలో ఉడికిస్తుంటే నీరు పూర్తిగా ఇంకిపోయి అన్నం మెత్తగా ఉడికే వరకు ఉడికించాలి. ఇది సుమారు 15-20 నిమిషాలు పట్టవచ్చు. మీరు కుక్కర్ లో ఉడికిస్తుంటే 2 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి తర్వాత స్టవ్ ఆఫ్ చేయండి. ప్రెజర్ పూర్తిగా తగ్గిన తర్వాత మూత తీయండి. -అన్నం ఉడికిన తర్వాత ఒకసారి మెల్లగా కలపండి. సన్నగా తరిగిన కొత్తిమీర, వేయించిన జీడిపప్పు పలుకులతో గార్నిష్ చేయండి. కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం పిండితే మరింత రుచిగా ఉ ంటుంది. -పాలక్ కొబ్బరి అన్నం వేడి వేడిగా రైతా, పెరుగు లేదా ఏదైనా కూరతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది.

# రాగి పిండితో హెల్దీ బన్ దోశలు..

## పీకలదాకా తిన్నా ఇంకోటి కావాలంటారు..ఎలా చేయాలంటే




*మన ఆరోగ్యం మొత్తం దాదాపు మనం తీసుకునే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. కరోనా తర్వాత నుంచి అధికశాతం మంది తమ ఆరోగ్యంపై ఎక్కువ ఫోకస్ పెడుతూ హెల్దీ ఫుడ్ తీసుకుంటున్నారు. హెల్దీ ఫుడ్స్ లో రాగి పిండితో చేసే బన్ దోశలు కూడా ఒకటి. సాధారణంగా పొద్దున్నే పూరీ,బోండా,ఇడ్లీ,బియ్యం పిండితో దోశ వంటివి మనం తింటుంటాం. అయితే ఇవి కాకుండా పొద్దున్నే రాగిపిండితో చేసే హెల్దీ బన్ దోశలు ఓ సారి టేస్ట్ చేసి చూడండి..అస్సలు వదలిపెట్టరు. అంత రుచిగా ఉంటాయి..అంతేకాకుండా ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. రాగి పిండిలో ఐరన్, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాంటి రాగి పిండితో హెల్దీ బన్ దోశలు ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి. రాగి పిండితో బన్ దోశలు తయారీకి కావాల్సిన పదార్థాలు -రాగి పిండి -బొంబాయి రవ్వ -పెరుగు -నీళ్లు -ఆవాలు -జీలకర్ర -కరివేపాకు -ఆయిల్ -ఇంగువ -పచ్చిమిర్చి. రాగి పిండితో బన్ దోశలు తయారీ విధానం -రాగి బన్ దోశలు తయారుచేయడం కోసం ముందుగా ఒక పెద్ద బౌల్ తీసుకొని అందులో అరకప్పు బొంబాయి రవ్వ, 1 కప్పు రాగి పిండి, 1 కప్పు పెరుగు వేసి మొత్తం కలిసేలా కలుపుకున్నాక ఇందులో అరకప్పు నీళ్లు పోసి బాగా కలిపి 10 నిమిషాలు పక్కనపెట్టేయాలి. -10 నిమిషాలు నానిన తర్వాత ఈ పిండిని మిక్సీ గిన్నెలో వేసి నీళ్లు ఏమీ వేయకుండానే దోశ పిండిలా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పిండిని గిన్నెలోకి తీసుకొని పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి అందులో ఒకటిన్నర స్పూన్ ఆయిల్ వేడి చేసి ఇందులో కొద్దిగా ఆవాలు,జీలకర్ర వేసి అవి చిటపటలాడిన తర్వాత కొద్దిగా ఇంగువ వేసి కలిపాక 2 పచ్చిమిర్చి తరుగు,కొద్దిగా కరివేపాకు వేసి ఫ్రై అయ్యాక ఇందులో చిన్నగా కట్ చేసిన 1 టమాటో ముక్కలు వేసి అవి కొంచెం మెత్తబడేదాకా ఫ్రై చేసి స్టవ్ ఆఫ్ చేసేయండి.ఈ తాళింపుని ముందుగా రెడీ చేసుకున్న పిండిలో వేసేయాలి. ఇందులోనే సన్నగా కట్ చేసిన 2 ఉల్లియాల ముక్కలు, కొత్తిమీర తరుగు,రుచికి తగినట్లుగా ఉప్పు, కొద్దిగా వంటసోడా వేసి పిండిలో అన్నీ బాగా కలిసేలా కలుపుకోవాలి. - ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాండీ పెట్టి అందులో కొంచెం ఆయిల్ వేసి దానిమీద పెద్ద గరిట పిండిని వేసుకొని ఒకవేపు కాలిన తర్వాత తిప్పుకొని దానిని రెండోవైపు కాల్చి దించేయాలి. అంతే రాగి బన్ దోశలు రెడీ. దీనిని మీకు నచ్చిన చట్నీతో కలిపి తింటే నోట్లో బ్లాస్టే.*

# ఇది తినని మనిషి జన్మ ఎందుకు..

## మన పూర్వీకుల ఎనర్జీకి కారణం ఇదే..ఎలా చేసుకోవాలంటే



మీరెప్పుడైనా రాగిపిండి, సగ్గుబియ్యం కిచిడి తిన్నారా? సూపర్ టేస్ట్ ఉంటుంది. ఈ కిచిడి ఒక పోషకవైన,తేలికగా జీర్ణమయ్యే ఆహారం. రాగిలో ఐరన్, కాల్షియం,ఫైబర్ పుష్కలంగా ఉంటాయి..సగ్గు బియ్యం తక్షణ శక్తిని అందిస్తాయి. ఈ రెండింటి కలయికతో తయారైన కిచిడి రుచికరమైనది మాత్రమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. రాగిపిండి సగ్గుబియ్యం కిచిడిని మీ ఇంట్లోనే సింపుల్ గా తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీకి కావలసిన పదార్థాలు -పెసరపప్పు -సగ్గుబియ్యం -రాగిపిండి -మిరియాలు -జీడిపప్పు -పచ్చిమిర్చి -నెయ్యి -అల్లం -పసుపు -క్యారెట్ -ఉల్లిపాయ -టమాటో -వెల్లుల్లి -జీలకర్ర -కరివేపాకు

రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీ విధానం -ముందుగా ఓ ప్రెజర్ కుక్కర్ లో శుభ్రంగా కడిగిన అరకప్పు పెసరప్పు, అరకప్పు సగ్గు బియ్యం, 4 పచ్చిమిర్చి ముక్కలు, 1 టమాటో పెద్ద ముక్కలు, 1 ఉల్లిపాయ పెద్ద ముక్కలు, 1 క్యారెట్ ముక్కలు,కొన్ని అల్లం ముక్కలు, పొట్టు తీసిన 2 వెల్లుల్లి రెబ్బలు, 10-15 మిరియాలు, చిటికెడు పసుపు వేయాలి. ఇందులో ముక్కలు మునిగేదాకా నీళ్లు పోసి కలిపి మూతపెట్టి స్టవ్ మీద పెట్టాలి. -రెండు విజిల్స్ వచ్చాక స్టవ్ ఆఫ్ చేసేయండి. ప్రెజర్ అంతా పోయిన తర్వాత కుక్కర్ మూత తీసి ఉడికిన పప్పుని గుత్తితో మెత్తగా మాష్ చేసుకోవాలి. -తర్వాత మళ్లీ స్టవ్ ఆన్ చేసి అది ఉడకనివ్వాలి. ఉడికే సమయంలోనే అందులో అరకప్పు రాగిపిండి ఉండలల్లేకుండా బాగా కలపుతూ మంటను సిమ్ లో పెట్టి ఉడికించుకోవాలి. 10 నిమిషాలు రాగిపిండిని అందులో బాగా ఉడికించుకున్నాక రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి దగ్గరపడేదాకా ఉడికించుకోవాలి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 2-3 స్పూన్ల నెయ్యి వేడి చేశాక జీడిపప్పు,మిరియాలు వేసి ఫ్రై చేసుకోవాలి. -జీడిపప్పు వేగిన తర్వాత కరివేపాకు,జీలకర్ర వేసి వేయించుకొని తర్వాత ఈ తాళింపు మొత్తాన్ని ముందుగా ఉడికించిన కిచిడిలో వేసి కలుపుకోవాలి. ఇందులో అరచెక్క నిమ్మరసం పిండి బాగా కలుపుకోవాలి.

# సినిమా న్యూస్



# సెల్ఫీ వివాదంపై పూజా హెగ్డే అదిరిపోయే కౌంటర్!



టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే ప్రస్తుతం ఒక క్రేజీ వివాదంలో చిక్కుకుంది. ఒక ఈవెంట్‌లో అభిమానిని పట్టించుకోకుండా వెళ్ళిపోయిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌పై ఆమె ఎట్టకేలకు నోరు విప్పింది. నెటిజన్లు తనపై చేస్తున్న విమర్శలకు ఎంతో హుందాగా సమాధానం ఇస్తూ, అసలు అక్కడ ఏం జరిగిందో క్లారిటీ ఇచ్చింది. ఈ వైరల్ వివాదం, దానికి పూజా ఇచ్చిన క్రేజీ రిప్లై ఏంటో చూద్దాం.. కొత్త సినిమా హడావిడిలో బుట్టబొమ్మ: పూజా హెగ్డే నటించిన లేటెస్ట్ హిందీ సినిమా 'హై జవానీతో ఇష్క్ హోనా హై' జూన్ 5న థియేటర్లలోకి రావడానికి రెడీగా ఉంది. వరుణ్ ధావన్ హీరోగా, మృణాల్ ఠాకూర్ మరో కీలక పాత్రలో నటించిన ఈ సినిమా ప్రమోషన్స్ ప్రస్తుతం ఫుల్ జోరుగా సాగుతున్నాయి. అయితే కరెక్ట్‌గా సినిమా రిలీజ్ దగ్గరపడుతున్న టైమ్‌లోనే పూజా ఒక అనుకోని వివాదంలో ఇరుక్కుంది. వైరల్ వీడియో.. నెటిజన్ల ఫైర్: ఇటీవల జరిగిన ఒక ఈవెంట్‌లో పూజా హెగ్డే నడుచుకుంటూ వెళ్తుండగా.. ఒక అభిమాని ఆమెతో సెల్ఫీ దిగడానికి ట్రై చేశాడు. కానీ పూజా అతడిని గమనించకుండా అలాగే ముందుకు వెళ్ళిపోయింది. ఈ చిన్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఇక దాంతో నెటిజన్లు "స్టార్ స్టేటస్ రాగానే అంత పొగరా?" అంటూ ఆమెపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాకు పొగరు లేదు.. పూజా క్లారిటీ: తనపై వస్తున్న విమర్శలపై పూజా హెగ్డే స్పందిస్తూ అసలు విషయాన్ని బయటపెట్టింది. "సినిమా ఇండస్ట్రీలో ఉండే వాళ్లకు జీవితాన్ని ఇచ్చేదే ప్రేక్షకులు మరియు అభిమానులు. కొన్నిసార్లు విపరీతమైన రద్దీ ఉండటం వల్ల లేదా అర్జెంట్ పరిస్థితుల వల్ల హడావిడిగా వెళ్లాల్సి వస్తుంది. ఇక అలాంటప్పుడు మా చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరినీ గమనించడం కుదరకపోవచ్చు. అంతేకానీ మాకు పొగరు ఉందని అస్సలు కాదు" అని వివరించింది. అభిమానులే మా దేవుళ్లు: తన మనసులో ఫ్యాన్స్‌కు ఎంత గౌరవం ఉందో చెబుతూ పూజా ఎమోషనల్ అయ్యింది. "మాకు ఎప్పుడూ అభిమానులే కొండంత బలం. వాళ్లు మాకు దేవుడితో సమానం. కాబట్టి ఇలాంటి చిన్న చిన్న సంఘటనలను చూసి నన్ను దయచేసి ఎవరూ తప్పుగా అర్థం చేసుకోవద్దు" అని రిక్వెస్ట్ చేసింది. ఈ స్మార్ట్ సమాధానంతో ట్రోలర్స్ నోళ్లు మూతపడ్డాయి. తప్పుగా అర్థం చేసుకోవద్దు: సెలబ్రిటీలు ఎక్కడికి వెళ్లినా వందల మంది చుట్టుముట్టడం సహజం. ఆ హడావిడిలో ఒక్కోసారి ఫ్యాన్స్‌ను పలకరించడం కుదరకపోవచ్చు. ఇక పూజా హెగ్డే ఎంతో సింపుల్‌గా, పాజిటివ్‌గా సమాధానం చెప్పి ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టేసింది. మరి జూన్ 5న రాబోతున్న ఆమె కొత్త సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి..

# దురంధర్-యానిమల్' పై నెగెటివ్ సమీక్షలు చదవలేదా విఘ్నేషా?



సోషల్ మీడియా - డిజిటల్ యుగంలో ఈరోజు ఏ సినిమా విడుదలైనా ప్రారంభంలో నెగెటివ్ టాక్ రావడం అనేది చాలా సహజమైన విషయంగా మారిపోయింది. కేవలం మీడియాలో వచ్చే ప్రతికూల సమీక్షల పైనే ఒక సినిమా పూర్తి ఫలితం ఆధారపడి ఉండదని ఇటీవలి కాలంలో చాలా చిత్రాలు నిరూపించాయి. ఇందుకు తాజా ఉదాహరణగా నిలిచింది -దురంధర్- చిత్రం. ప్రారంభంలో ఈ సినిమాకు ప్రాంతీయ భాషల్లో ఆశించిన సమీక్షలు రాలేదు. పైగా ఇందులో చూపించిన రక్తపాతం, హింసపై సోషల్ మీడియాలో బోలెడంత నెగెటివ్ ప్రచారం సాగింది. అయినా ఆ తర్వాత నెమ్మదిగా నిలకడైన వసూళ్లను సాధిస్తూ బాక్సాఫీస్ వద్ద నిలబడింది. బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించిన తర్వాత.. ఒకప్పుడు నెగెటివ్ కామెంట్లు చేసిన వారే ఈ సినిమాలో కంటెంట్ మ్యాటర్ బలంగా ఉంది గనుకనే ప్రజలు హిట్ చేశారంటూ ప్రశంసించడం మొదలుపెట్టారు. ఇంతకుముందు బ్లాక్‌బస్టర్ హిట్ -యానిమల్- సినిమా విషయంలోనూ సరిగ్గా ఇదే తరహా వాతావరణం కనిపించింది. ఆ చిత్రం విడుదలైన కొత్తలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగాను నేరుగా టార్గెట్ చేస్తూ.. సినిమాలో విపరీతమైన హింస, రక్తపాతం - స్త్రీ వివక్ష ఉందంటూ చాలా మంది తీవ్రంగా విమర్శించారు. కానీ ఆ విమర్శలన్నింటికీ -యానిమల్- సాధించిన రికార్డు స్థాయి కలెక్షన్లే సమాధానంగా మారాయి. అయితే దురంధర్, యానిమల్ వంటి సినిమాలు నెగెటివ్ టాక్‌ను తట్టుకుని నిలబడినట్లుగా.. తన తాజా చిత్రం -లవ్ ఇన్సూరెన్స్ కొంపనీ- (ఎల్.ఐ.కే) ఎందుకు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేకపోయిందో దర్శకుడు విఘ్నేష్ శివన్ విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. తన సినిమాకు వచ్చిన ప్రారంభ నెగెటివ్ సమీక్షలే దెబ్బ కొట్టాయని ఆవేదన చెందుతున్న విఘ్నేష్.. ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో ఆ చిత్రానికి గొప్ప ఆదరణ దక్కుతుండటంతో సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ అవుతున్నారు. కానీ నేటి రోజుల్లో ప్రతి సినిమాకు ప్రారంభంలో నెగెటివ్ సమీక్షలు తప్పడం లేదనే వాస్తవాన్ని ఆయన గ్రహించాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరికీ మిశ్రమ స్పందనలు సహజంగా మారాయి. తొలి వీకెండ్ తర్వాతా నిలబెట్టేంత కంటెంట్ కేవలం సినిమాలో ఉండాలి.. అప్పుడే జనం థియేటర్లకు వస్తున్నారు. ఇండస్ట్రీలోని పలు అంశాలపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పే దర్శకుడు విఘ్నేష్ శివన్.. ప్రదీప్ రంగనాథన్, ఎస్‌జే సూర్య, కృతి శెట్టి ప్రధాన పాత్రల్లో తాను తెరకెక్కించిన -లవ్ ఇన్సూరెన్స్ కొంపెనీ- (ఎల్ఐకే) బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి ఫలితాన్ని అందుకోలేకపోవడంపై ఇన్‌స్టా స్టోరీలో ఒక సుదీర్ఘమైన నోట్‌ను షేర్ చేసారు. దాదాపు 190 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందించిన ఈ చిత్రం థియేటర్లలో కేవలం రూ.66 కోట్లు మాత్రమే వసూలు చేసి నిరాశపరిచింది. 10 ఏప్రిల్ 2026న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం.. ఇటీవల అమెజాన్ ప్రైమ్ లోకి వచ్చిన తర్వాత ఊహించని విధంగా వీక్షకుల నుండి అద్భుతమైన సానుకూల స్పందనను సొంతం చేసుకుంటోంది. ఆన్‌లైన్‌లో ఉన్న నెగెటివిటీ కారణంగానే తాము ఈ సినిమాను థియేటర్లలో చూడలేకపోయామని ఇప్పుడు ఓటీటీలో చూశాక చాలా బాధపడుతున్నామని చెప్తూ ఎంతో మంది తనకు మెసేజ్‌లు పంపుతున్నారని విఘ్నేష్ తన నోట్‌లో పేర్కొన్నారు.

# ఎంత చేసినా భార్యలు ఇంప్రెస్ అవ్వరు.. మోహన్‌లాల్ సెన్సేషనల్ కామెంట్స్



మలయాళ సినీ పరిశ్రమలో అత్యంత గౌరవనీయ నటుల్లో ఒకరైన మోహన్‌లాల్ తన నటనతోనే కాదు, వ్యక్తిత్వంతోనూ అభిమానుల మనసులు గెలుచుకుంటూ వస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా భార్యాభర్తల సంబంధాల గురించి, తన భార్య సుచిత్రతో ఉన్న అనుబంధం గురించి మోహన్‌లాల్ చెప్పిన మాటలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా మీ భార్యను ఇంప్రెస్ చేయడానికి మీరు ఏమి చేస్తారనే ప్రశ్న ఎదురవగా మోహన్‌లాల్ తనదైన శైలిలో స్పందించారు. భర్తలు ఏం చేసినా భార్యలు పూర్తిగా ఇంప్రెస్ అవ్వరని, తాను కూడా తన భార్యను ఆకట్టుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాను. కానీ ఇప్పటివరకు వాటిలో ఏదీ పూర్తిగా పనిచేయలేదని, నిజానికి ఎవరినైనా కావాలని ఇంప్రెస్ చేయాలని ట్రై చేస్తే అది సులభంగా కనిపెట్టేస్తారని, ఎందుకంటే ఎదుటి వ్యక్తి అంత తెలివిగా ఉంటారని, అందుకే సహజంగా ఉండటమే మంచిదని ఆయన అన్నారు. మోహన్ లాల్ చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీశాయి. ఇదే సందర్భంలో భార్యకు దాచిపెట్టే విషయాల గురించి అడిగిన ప్రశ్నకు కూడా మోహన్‌లాల్ ఆసక్తికర సమాధానం ఇచ్చారు. తనకు అబద్ధం చెప్పడం కూడా సరిగా రాదని, భార్య దగ్గర తనకు దాచిపెట్టాల్సిన విషయాలేమీ లేవని, కొన్ని సందర్భాల్లో వెంటనే చెప్పలేని విషయాలు ఉండొచ్చు. కానీ తరువాత వాటిని తప్పకుండా చెబుతానని, ఆమెకు తెలియకుండా తానేదీ దాచనని క్లారిటీ ఇచ్చారు. భార్యాభర్తల మధ్య నమ్మకం, పారదర్శకత ఎంత ముఖ్యమో తన మాటల ద్వారా వివరించినట్లు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. మోహన్‌లాల్ భార్య సుచిత్ర కూడా సినీ అభిమానులకు సుపరిచితమే. ప్రముఖ తమిళ సినీ నిర్మాత కుమార్తె అయిన ఆమె, మోహన్‌లాల్ సినిమాలకు అభిమానిగా ఉండేది. ఆ అభిమానం క్రమంగా ప్రేమగా మారి, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఇద్దరూ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. జాతకాల విషయంలో కొన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి 1988 ఏప్రిల్ 28న వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా అన్యోన్య దాంపత్య జీవితాన్ని కొనసాగిస్తున్నారు. మలయాళ సినీ పరిశ్రమలో ఆదర్శ దంపతులుగా గుర్తింపు పొందిన ఈ జంట, కుటుంబ విలువలకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోంది. మోహన్‌లాల్ కెరీర్‌లో ఎన్నో సక్సెస్‌లు వచ్చినప్పటికీ ప్రతి దశలోనూ సుచిత్ర అండగా నిలిచిందని సినీ వర్గాలు చెబుతుంటాయి.

# వరుస రిస్క్‌లు.. అనుపమ ప్లాన్ ఇదేనా?



హీరోయిన్ల కెరీర్‌లో సేఫ్ జోన్‌లో కొనసాగడం చాలా సాధారణ విషయం. ముఖ్యంగా స్టార్ ఇమేజ్, మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎక్కువ మంది హీరోయిన్లు గ్లామర్ పాత్రలు లేదా కమర్షియల్ సినిమాల వైపే మొగ్గు చూపుతుంటారు. కానీ అనుపమ పరమేశ్వరన్ మాత్రం ఆ మార్గానికి భిన్నంగా తన కెరీర్ ను కొనసాగిస్తోంది. కెరీర్ మొదట్లో పక్కింటి అమ్మాయి పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ మలయాళీ భామ, గత కొంతకాలంగా నటిగా తన సత్తాను చాటే పాత్రలకే ప్రాధాన్యత ఇస్తోంది. తాజాగా రిలీజైన మరీచిక కూడా అదే లిస్ట్ లో చేరింది. సినిమా రిజల్ట్ ఎలా ఉన్నా, అందులో అనుపమ చేసిన పాత్ర మాత్రం ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరీచికలో అనుపమ పోషించిన వెంకటలక్ష్మి పాత్ర సాధారణ హీరోయిన్ క్యారెక్టర్ కాదు. ఒకవైపు అమాయకంగా కనిపించే యువతిగా, మరోవైపు పూర్తిగా భిన్నమైన కోణాన్ని కలిగిన వ్యక్తిగా డైరెక్టర్ ఆమె పాత్రను డిజైన్ చేసిన తీరు ఆడియన్స్ కు సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఓ వైపు పళ్లకు క్లిప్స్, కళ్లద్దాలతో కనిపించే లుక్, మరోవైపు మోడరన్ లుక్‌లోని వైవిధ్యాన్ని ప్రతిబింబించింది. అంతేకాదు, మానసిక సంఘర్షణలతో బాధపడుతున్న యువతిగా ఒక సందర్భంలో కనిపిస్తే, మరో సందర్భంలో పరిస్థితులన్నింటినీ అర్థం చేసుకున్న తెలివైన వ్యక్తిలా కనిపించడం అనుపమ నటనకు మరో పరీక్షగా నిలిచింది. ఈ రెండు షేడ్స్‌ను తెరపై సమర్థంగా ప్రదర్శించడంలో ఆమె బాగా సక్సెస్ అయిందనే అభిప్రాయం ప్రేక్షకుల నుంచి వ్యక్తమవుతోంది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma